


ధర్మ సందేహం

## తోడుగా గౌరమ్మ ఎందుకు?

**సద్దుల బతుకమ్మ సందడిలో పెద్ద బతుకమ్మకు జంటగా చిన్నదానిని కూడా ఉంచుతారు. కారణం?**

• **జయలక్ష్మి,** నాగుపల్లి

**బతుకమ్మ** అంటే అమ్మవారిని పూలరూపంలో ఆవాహన చేసి ఆరాధించే పండుగ. మహాలయ అమావాస్య మొదలుకొని దుర్గాష్టమి వరకు తొమ్మిది రోజులపాటు ఊరూవాడా సందడి నెలకొంటుంది. బతుకమ్మ పండుగ నుంచి.. వర్షరుతువు ముగిసి శరత్ రుతువు మొదలవుతుంది. రకరకాలైన పూలు విరిసి భూమాత ఆహ్లాదం పొందుతుంది. 'చంపకాశోక పున్నాగ సౌగంధిక లసత్కచాయై నమః– సంపంగి, అశోక, పున్నాగ, చెంగల్వ వంటి పూల పరిమళాలతో ప్రకాశించే శిరోజ సంపద కలిగిన ఓ జగన్మాతా!' అంటూ అమ్మవారిని నవరాత్రులు ఆరాధిస్తారు భక్తులు. ఇందులో భాగంగా అమ్మవారిని పూలతో బతుకమ్మగా కొలువు దీర్చి ఆటపాటలతో కొలుస్తారు. సద్దుల బతుకమ్మ నాడు పెద్ద బతుకమ్మను పేరుస్తారు. ఆ తల్లిని ఆడబిడ్డలకు ప్రతిరూపంగా భావిస్తారు. ఈ పండుగ నాటికి విధిగా ఆడబిడ్డలను పుట్టింటికి ఆహ్వానిస్తారు. పెద్ద బతుకమ్మకు జంటగా రెండో బతుకమ్మను గౌరీదేవికి ప్రతిరూపంగా పేరుస్తారు. పసుపుతో గౌరమ్మను చేసి అందులో ఉంచి, పూలతో అలంకరిస్తారు. బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేసే సందర్భంలో పసుపు గౌరమ్మను వెనక్కి తీసుకొని, పూల బతుకమ్మను నీటిలో వదులుతారు. ఆ పసుపు గౌరమ్మను ఆడబిడ్డలు కళ్లకు అద్దుకొని, అమ్మవారి ప్రసాదంగా అలంకరించుకుంటారు. అందుకే, గౌరీదేవికి ప్రతిరూపంగా చిన్న బతుకమ్మను (గౌరమ్మను) పేర్చే సంప్రదాయం ఏర్పడింది.



**ఏ దేవుడినైనా మనం పూలతో పూజిస్తాం. కానీ పూలనే పూజించే గొప్ప సంస్కృతి బతుకమ్మ పండుగ. దేవీ నవరాత్రులలో జ్ఞానపదులు శిష్టాచారంతో అమ్మను పూజిస్తే.. జానపదులు పసుపుతో గౌరిని చేసి మొక్కే తత్త్వమే బతుకమ్మ. చేను చెలకల్లో, గుట్టల్లో పూసే గునుగు, తంగేడు, అడవి చేమంతి, కట్లపూలు, ముత్యాల పూలు, గడ్డిపూలు మొదలైన అడవి పూలకు చేసే అర్చనే.. బతుకమ్మ పండుగ.**

# పూలకొమ్మ బతుకమ్మ!

**బతుకమ్మ** తెలంగాణ అస్తిత్వాన్ని తెలిపే పూలపండుగ. భాద్రపద అమావాస్య మొదలు ఆశ్వియుజ శుక్ల అష్టమి వరకు తొమ్మిది రోజులు ఈ వేడుక జరుపుకొంటారు. అమావాస్య రోజున పెత్రామాస, చిన్న బతుకమ్మ, ఎంగిలిపూల బతుకమ్మ.. ఇలా వివిధ పేర్లతో మొదటి రోజు చిన్న బతుకమ్మ ప్రారంభమవుతుంది. తదుపరి అష్టమి రోజున సద్దుల బతుకమ్మ లేదా పెద్ద బతుకమ్మతో పూర్తి అవుతుంది. ఎంగిలి పూల బతుకమ్మ పితృపక్షాలలో వస్తుంది. అమావాస్య నాడు తమ పిత్రు దేవతలు వచ్చి, ఎంగిలిపడి వెళ్తారని, అందువల్లే ఈ పండుగను ఎంగిలి పూల బతుకమ్మ అంటారని పెద్దల మాట. కోడళ్లు అత్తవారింట ఈ పండుగ చేసుకొంటారు. సద్దుల బతుకమ్మ రోజు ప్రతీ ఆడపిల్ల తన పుట్టింట అక్కాచెల్లెళ్లు, చిన్ననాటి స్నేహితులతో ఈ పండుగ జరుపుకొంటుంది. గాజుల గలగలలు, పట్టు చీరల రెపరెపలు, ఆభరణాల అందాలు, పూల సుగంధాలు, ఎటు చూసినా ఇంతుల అందాలు హరివిల్లులా పల్లె అందాన్ని ఇనుమడిస్తాయి. పూర్వం నుంచీ ఉన్న సంప్రదాయం ఇది. కాకతీయులు తమ కుల దేవత ముంగిట గుమ్మడి పూలతో పూజించే వారట. బతుకమ్మ చోళుల కాలంలోనూ ఉండేది అనడానికి 'ధర్మంగుడను రాజు..' పాటే సాక్ష్యం.

### తరాల బతుకమ్మ

వరుసలు వరుసలుగా పూలను పేరుస్తూ, వలయాకారపు మేరువులా తీరుస్తూ, ఆ పైన పసుపు గౌరమ్మను ఉంచడమే బతుకమ్మ. తదుపరి, ఇంటి కూరాడుకు నమస్కరించడం ఆచారం. ఇక్కడి సంప్రదాయంలో తల్లి బతుకమ్మ, పిల్ల బతుకమ్మ అని రెండు బతుకమ్మలను పేర్చడం ఆనవాయితీ. స్త్రీలోని మాతృత్వ కోణం ఇందులో పుష్కలంగా కనిపిస్తుంది. సాయంత్రం అంతా కలిసి చెరువు ఒడ్డునో, కుంట దగ్గరో.. బతుకమ్మ ఆడుతారు.

### అందమైన ఆట

చక్కగా ఓ పెద్ద ముత్తయిదువ వెంపలి కొమ్మను మధ్యలో పెట్టి, పసుపు కుంకుమలతో ఆ మొక్కను సతీదేవిగా తలచి పూజిస్తుంది. తదుపరి, ఆ పేర్చిన బతుకమ్మలకు సద్ది సద్దులను పెడతారు. అందరూ వలయాకారంగా చప్పట్లు చరుస్తూ, పాట పాడుతూ తిరుగుతారు. అమ్మ గౌరీదేవిని ఆరాధిస్తారు. ఈ జానపదలు పాట.. ఓ గళార్చన, ఓ ప్రదక్షిణ! ఇన్ని ప్రక్రియలతో పండుగ సాగుతుంది. పాటలొచ్చినవారు పాడుతుంటే, మిగిలినవారు అనుసరిస్తూ ఆడుతారు. ఈ పాటల్లో ఎదిగిన బిడ్డలకు ఎన్నో సుద్దులు, బుద్ధులు ఉంటాయి. గౌరీదేవిని తమ బిడ్డగా తలచి పాటలు పాడి నీళ్లలో కలుపుతారు. చివరి రోజున 'పోయిరా గౌరమ్మ, పోయిరావమ్మ, వచ్చే సంవత్సరంలో మళ్లీ రావమ్మ' అంటూ ఆ తల్లిని సాగనంపుతారు. బతుకమ్మ పాటలో పురాణ కథలు, చారిత్రక గాథలు, సామాజిక సమస్యలు.. అన్నీ పదాలై ప్రవహిస్తాయి. ఇలా, గంటలకొద్దీ ఆడేవారు మన పెద్దలు. ఇన్ని రకాల పూల చుట్టూ ఓ రెండు గంటలు ఆడిపాడితే.. సంవత్సర కాలం నడుము నొప్పులు, కాళ్ల నొప్పులు మన దగ్గరికే రావు.

1. **పేర్చడంలో ఆధ్యాత్మికత**
2. **పూలలో ఆయుర్వేదం**
3. **పాడే పాటల్లో బతుకుపై అవగాహన**
4. **ఆడే ఆటల్లో సామాజిక స్పృహ, ఆరోగ్యతత్త్వం**

..అన్నీ కలిసి ఆడపిల్లలకు పుట్టింటి బంధం, మగపిల్లలకు తోబుట్టువు అనుబంధం గొప్పతనాన్ని చాటిచెబుతాయి. కుప్పబోసి చూస్తే, అందాల బతుకమ్మ బతుకునిచ్చే అమ్మగా, బతుకమ్మగా నిలుస్తుంది.

..ఇన్ని మంచి గుణాలున్న పండుగ కాలంతో పాటు మార్పులు చెందుతూ, అస్తిత్వానికి కొంత దూరమవుతున్నదనే ఆవేదన కూడా వ్యక్తం అవుతున్నది. ఆట మారింది. పాట డీజేలలో మాత్రమే వినిపిస్తున్నది. ఆహార్యంలో వింత పోకడ కనిపిస్తున్నది. ఆడుతూ, పాడుతూ, చుట్టూతా తిరుగుతూ అమ్మను ఆరాధిస్తూ, ఈ ప్రకృతే పరమాత్మ అని తలుస్తూ.. మన అస్తిత్వం, చిహ్నం అనుకున్న మన పండుగ రూపురేఖలు మారకుండా కాపాడుకునే ప్రయత్నం చేస్తూ, ఆ అడవి పూల మధ్య ఆనందిద్దాం! అమ్మను కొలుద్దాం! పూలను అర్చిద్దాం. పాటను ప్రేమిద్దాం. జై బతుకమ్మ, జై జై తెలంగాణ!

... డా. భేరి సునీత రాంమోహన్ రెడ్డి

# హృదయ నివేదన.. భజన!

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాద సేవనం
అర్చనం వందనం దాస్యం–సఖ్యమాత్మ నివేదనం

**..అంటుంది భాగవతం. భగవంతుడిని, భక్తుడిని అనుసంధానించేది పరమ భక్తి. దీనికి నవవిధ మార్గాలున్నాయి. పరీక్షిత్తులా శ్రవణం; నారద, తుంబుర, ప్రహ్లాదుల్లా కీర్తన విధానాలు ఆచరించవచ్చు. నామ, రూప, స్వరూప మిళితమైన స్మరణ పద్ధతీ ఉంది. ఈ భక్తితత్పరులు ధ్రువుడు, తులసీదాసు తదితరులు. పాద సేవనానికి గుహుడు, దాస్యభక్తికి ఆళ్వార్లు పేరొందిన వారు. సఖ్యతకు అర్జునుడు, ఆత్మ నివేదనా తత్వానికి ద్రౌపది ప్రతీకలు. వీటితో పాటు అర్చన, వందనాదులూ భగవద్ భక్తి ప్రపత్తికి మార్గాలు. వీటన్నిటి సమాహారమే.. భజన.**

**భజన** అనే మూడక్షరాల పదానికి అనేక అర్థాలు. భగవానుడి సేవ, స్తుతి అని మూలభావం. ధీరత్వం అనే అర్థమూ ఉంది. నిజమే మరి. ఊరూ వాడా కలిసి చేసే భక్తి భజనలు ఎంతో కనువిందు, వీనులకూ పసందు. 'శ్రీరామ నీ నామమెంతో రుచిరా.. కదళీ ఖర్జూరాది ఫలములకన్న, నవరస పరమాన్న నవనీతములకన్న ఎంతో రుచిరా' – అంటూ భక్త జనులంతా రాగ తాళ భరితంగా, లయబద్ధంగా భజిస్తుంటే ఆ పరిసరాలంతటా భక్తి తరంగాలు వ్యాపిస్తాయి. ఒకప్పుడు ఏ పల్లెపట్టులోనైనా ఓ భజన మందిరం తప్పక ఉండేది. మధ్యలో ఏ కాస్త విరామం దొరికినా పెద్దలూ పిన్నలూ అక్కడే చేరేవారు. తాళాలూ, చిడతల శబ్ద మాధుర్యంతో చుట్టుపక్కల పవిత్ర వాతావరణం నెలకొనేది. అదంతా ఒక తన్మయత. ఆలాపనలు, నర్తనలు జమిలిగా సాగేవి. స్తుతులు, శ్లోకాలు, పాటలు, పద్యాలు, సామెతలు, జాతీయాలు, పద చమత్కారాలు– ఒకటా రెండా.. అనేకం. వాటిల్లోనూ పోటాపోటీ. పలు విధాలుగా వర్ణించడం, చింతనతో వేడుకోవడం, దైవాన్ని సూటిగా ప్రశ్నించడం, కష్టనష్టాలు చెప్పుకోవడం, ఆ భజనల్లోనే ఒక్కోసారి నిందా స్తుతి సాగించడం.. లెక్కలేనన్ని భక్తి మార్గాలు.

### ఎంతో రుచిరా..


ఆంజనేయం మహావీరం,
బ్రహ్మ విష్ణు శివాత్మకం
బాలార్క సదృశాభాసం,
రామదూతం నమామ్యహం

అన్నట్టు– రామభక్త హనుమ భజనలకు తెలుగునాట ఏనాడూ కొదవ లేదు. ఆయనను త్రిమూర్త స్వరూపుడిగా కొలుస్తుంటారు. పలు రీతుల్లో రామకథాగానం చేసిన భక్త దూతగా భజిస్తారు. యత్ర యత్ర రఘునాథ కీర్తనం.. తత్ర తత్ర కృత మస్తకాంజలిం, బాష్పవారి పరిపూర్ణ లోచనం మారుతీం.. అని కదా అంటారు. రామ భజన జరిగే ప్రతిచోటా మహదానంద బాష్ప లోచనాలతో ఆంజనేయ స్వామి ఉంటాడట! దైవ నామం అనగానే జ్ఞాన, నామదేవుల కథ గుర్తుకొస్తుంది. ఇద్దరూ పండరీనాథ భక్తులే. ఒకసారి యాత్రలకు పయనమయ్యారు. దారిలో దప్పికయింది. దగ్గరిలోని బావి దరికి చేరారు. నీళ్లు లోపల ఎక్కడో ఉన్నాయి. మహిమాన్విత శక్తి నిండిన జ్ఞానదేవుడు పక్షిగా మారి, లోపలికెళ్లి దాహం తీర్చుకొని వచ్చాడు. 'నిన్నూ పిట్టగా మారుస్తాను. బావి నీళ్లు తాగి తిరిగి రా' అన్నాడు నవ్వుతూ. వద్దని బదులిచ్చాడు నామదేవుడు. నేను నమ్ముకున్న దేవుడే నాకు కావాల్సింది ఇస్తాడంటూ భగవన్నామ సంకీర్తన చేయగానే.. అప్పటిదాకా ఆ బావి అట్టడుగున ఉన్న జలం ఉబికి వచ్చి ఆయన దాహం తీర్చిందని పురాణ కథనం. అప్పుడు తెలిసొచ్చింది జ్ఞానదేవుడికి–లోకాన అన్నిటి కన్నా నామ కీర్తనే మిన్న అని. భక్త జనాత్మను భగవంతుడికి నివేదించడం అంటే ఏమిటో అవగతమైంది. ఇంతటి విశిష్ట తత్వం భజనతోనే పరిపూర్ణం అవుతుందన్నది అనుభవమున్నవారి మాట.

'హరే రామ హరే రామ..
రామ రామ హరే హరే
హరే కృష్ణ హరే కృష్ణ..
కృష్ణ కృష్ణ హరే హరే'

.. ఇంతకు మించిన భజనగీతం లేనేలేదంటారు ఇస్కాన్ వ్యవస్థాపకులు శ్రీల ప్రభుపాదులు. జానపద కళారూపాల సమాహారం భజనలు. ఏ ఒక్క ప్రాంతానికో ఇవి పరిమితం కాదు. ఇందులో సాహిత్య, సంగీత, నృత్యాభినయ నిపుణతలన్నీ కలగలిసి ఉన్నాయి. భజన.. వ్యాయామం, ధ్యానం, ప్రాణాయామం, నృత్యం.. ఇలా సమస్తమూ!

... జంధ్యాల శరత్ బాబు



ఇస్లాం బోధ

## కుమార్తెగా..

**ఒకసారి** ముహమ్మద్ ప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరికి ఒక మహిళ తన ఇద్దరు ఆడపిల్లలను వెంటపెట్టుకొని వచ్చింది. ఎన్నో రోజులుగా పస్తులున్నామని తన ఆకలి బాధను తెలియజేసిందా మహిళ. ఆ సమయానికి ఆయిషా (రజి) ఇంట్లో తినడానికి ఏమీలేవు, ఒకే ఒక్క ఖర్జూరం పండు తప్ప. ఆ ఖర్జూరాన్ని ఆయిషా (రజి) ఆమెకు అందించారు. ఆ మహిళ అందుకొని, రెండు సమాన భాగాలు చేసి, తన ఇద్దరు కూతుళ్లకు పంచి, తాను మాత్రం పస్తులుండిపోయింది. తన భర్త ముహమ్మద్ (స) ఇంటికి రాగానే ఈ వృత్తాంతాన్ని వినిపించారు ఆయిషా (రజి). అప్పుడు ప్రవక్త (స) ఆ మహిళ త్యాగాన్ని ఎంతగానో ప్రశంసించారు. ''తాను పస్తులుండి తన బిడ్డల ఆకలి తీర్చిన ఆ మహిళకు ఆ ఆడపిల్లలే నరకానికి అడ్డుగోడలవుతారు. స్వర్గానికి బాటలవుతార'ని చెప్పారు. ఇద్దరు లేక ముగ్గురు ఆడపిల్లలను పెంచి పోషించి.. వారికి సరైన విద్యాబుద్ధులు నేర్పించి మంచి వరుడికిచ్చి పెళ్లి జరిపిస్తే .. అలాంటి తల్లిదండ్రులు స్వర్గానికి వారసులవుతారని ప్రవక్త చెప్పారు. ఆడపిల్లల పట్ల వివక్ష చూపేవారికి, ఆడపిల్లల్ని గుండెలమీద కుంపటిగా భావించే వారికి, ఆడపిల్లల్ని కడుపులోనే చిదిమేసే వారికి ఈ సంఘటనలు కనువిప్పు. ప్రవక్త (స) తన నలుగురు కుమార్తెలను ఎంతో ప్రేమాదరణలతో పెంచి పెద్ద చేశారు. బయటి నుంచి ఇంటికి రాగానే వారి చేతులను ముద్దాడేవారు. ఇంట్లో మగపిల్లలు, ఆడపిల్లలు కనుగ ఉంటే.. ఇద్దరినీ సరిసమానంగా పెంచమన్నారు. ఎలాంటి వివక్ష చూపొద్దన్నారు. ఏదైనా వస్తువు, కానుక ఇంటికి తీసుకువస్తే ముందు ఆడపిల్లలకే ఇవ్వాలన్నారు. అవనిలో మహోన్నతమైన జన్మ ఆడజన్మ.. అమ్మగా స్వర్గం ఆమె పాదాక్రాంతం.. ఆలిగా ఆమె సేవలు, త్యాగాలు అనిర్వచనీయం. అందుకే ఇంటికి దీపం ఇల్లాలు అన్నారు. ఆడ బిడ్డలు ఇంటికే కాదు అవనికే వెలుగులు. బేటీ రోటీ.. అని ఊరకే అనలేదు. మొదటి సంతానం ఆడబిడ్డ పుడితే ఇక ఆ ఇంట్లో శుభాల వర్షం కురిసినట్లే. అందుకే, అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో మహిళలకోసం ప్రత్యేక అధ్యాయమే కేటాయించారు. పవిత్ర ఖుర్ఆన్ ప్రతిని తెరచి చూస్తే నాలుగో అధ్యాయంగా 'నిసా' మనకు కనిపిస్తుంది. 'నిసా' అంటే మహిళ అని అర్థం. ఈ అధ్యాయంలో బోధనలన్నీ మహిళలకే ప్రత్యేకం.




... ముహమ్మద్ ముజాహిద్
98482 83208

కథాసుధ

## నమ్మకం

**ఆశించినంత** పంట రాకపోవడంతో ఓ రైతు మానసిక అశాంతికి గురయ్యాడు. తన భర్త ఆందోళన పడుతున్నాడని ఆ రైతు భార్య గుర్తించింది. అయ్యప్ప మాల ధరించి నలభై రోజుల మండల దీక్ష చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని సలహా ఇచ్చింది. అప్పటికే గ్రామంలో చాలా మంది రైతులు దీక్ష తీసుకుని గుడివద్ద భజనలు చేస్తున్నారు. దీక్ష గురించి తెలుసుకుందామని స్వాములను కలిశాడు. వారు రైతు నిర్ణయాన్ని స్వాగతిస్తూ చెడు అలవాట్లకు, విలాసాలకు దూరంగా ఉండాలన్నారు. వస్త్ర నియమం పాటిస్తూ చన్నీటి స్నానం, ఒంటిపూట భోజనం, బ్రహ్మచర్యం లాంటి నియమాలు పాటించాలన్నారు. అన్నిటికీ అంగీకరించిన రైతును గురుస్వామి దగ్గరికి తీసుకు వెళ్లారు. 'మాలధారణ చేయాలని ఉంది. చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందా?' అని అడిగాడు రైతు గురుస్వామిని. ఆ ప్రశ్నకు స్పందిస్తూ.. చిరునవ్వుతో 'రైతువైన నీవు ఏ నమ్మకంతో పంటలను పండిస్తావు?' అని అడిగాడు గురుస్వామి. 'మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయనే నమ్మకంతో!' అని బదులిచ్చాడు రైతు. 'విత్తనాలు ఎలాంటివో, ఎప్పుడు వర్షాలు కురుస్తాయో తెలియదు. ఏ చీడ పడుతుందో, ఎంత దిగుబడి వస్తుందో తెలియదు. బాగా పండినా మంచి ధర పలుకుతుందో లేదో కూడా తెలియదు. కానీ పంటలు పండిస్తున్నావు. అంటే.. అంతా మంచే జరుగుతుందని నమ్ముతున్నావు. అదే నమ్మకం దేవుడి మీద కూడా పెట్టు. మంచి ఫలితాలు పొందుతావు' అని వివరించాడు గురుస్వామి. 'నిజమే. ఏదైనా నమ్మకంతో చేయాలి. భూమిపై ఎక్కడ తవ్వినా నిధి దొరుకుతుంది, అయితే రైతుకు ఉండే విశ్వాసం తవ్వేవాడికి ఉండాలని పెద్దలు ఎప్పుడో చెప్పారు కదా' అని మాల ధారణకు ఉపక్రమించాడు రైతు.



... ఆర్.సి.కృష్ణస్వామి రాజు,
93936 62821